క్లుప్తంగా...

నేడు బీఆర్ఎస్ నాయకుల సమావేశం

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ బీఆర్ఎస్ పార్టీ నాయకుల సమావేశం మంగళవారం నిర్వహిస్తున్నట్లు డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు పోరెడ్డి ధర్మారెడ్డి, ప్రధాన కార్యదర్శి పలుగుచెరువు మహేష్ వెల్లడించారు. ఈ సమావేశం ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ నివాసం ఆవరణలో జరుగుతుందన్నారు. పార్టీ బలోపేతం, పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు నిర్వహించాల్సిన అవగాహన కార్యక్రమాలపై సమావేశంలో చర్చిస్తామన్నారు.

విద్యార్థులను అభినందించిన మంత్రి హరీశ్‌రావు



రాజేంద్రనగర్: జాతీయ ఒలింపియాడ్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులను మంత్రి హరీష్‌రావు సోమవారం అభినందించారు. ఐఎన్‌టీఎస్‌వో ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ ఒలింపియాడ్ పోటీల్లో అత్తాపూర్ శాఖ శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులకు బహుమతులను మంత్రి అందజేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ఉత్తమ ప్రతిభను కనబరిచిన విద్యార్థులు రానున్న రోజుల్లో మరిన్ని పోటీల్లో పాల్గొని తమ సత్తాచాటాలని సూచించారు. ప్రిన్సిపల్ పుష్ప, శివరామకృష్ణ, అనిత తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ కానుకల పంపిణీ



రంజాన్ కానుకలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

రాజేంద్రనగర్: ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటైనప్పటి నుంచి సీఎం కేసీఆర్ మైనార్టీల సంక్షేమానికి కృషి చేస్తున్నారని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ అన్నారు. సోమవారం డివిజన్ పరిధిలోని జమా మసీద్ వద్ద పేద ముస్లిం కుటుంబాలకు రంజాన్ పండుగ కానుకలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..అన్ని వర్గాలకు ప్రభుత్వం సమ ప్రాధాన్యం ఇస్తోందన్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు పోరెడ్డి ధర్మారెడ్డి, ముర్తుజా ఆలీ పాల్గొన్నారు.

పండుగలు కలిసికట్టుగా జరుపుకోవాలి



ఇఫ్తార్ విందులో పాల్గొన్న మేయర్ మహేందర్‌గౌడ్ తదితరులు

బండ్లగూడ: ప్రజలంతా కలిసికట్టుగా పండుగలను జరుపుకోవాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మహేందర్‌గౌడ్ కోరారు. 13వ డివిజన్ ఇండస్ వ్యాలీ కాలనీలో సోమవారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు.కార్యక్రమంలో సీనియర్ నాయకులు నాగరాజు, సయ్యద్ ఖాజా తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోండి

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా అనేక అక్రమ నిర్మాణాలు వెలుస్తున్నాయని, వాటిపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోకాపేట 4వ వార్డు కౌన్సిలర్ ఎ.దుర్గేష్‌యాదవ్ మున్సిపల్ కమీషనర్ సత్యబాబుతో పాటు మంత్రి కేటీఆర్, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో జీప్లస్ 4 అంతస్తులకు అనుమతులు తీసుకుని ఏకంగా ఆరు, ఏడు అంతస్తులు నిర్మాణం చేపడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు.

ఫైనార్ట్స్ యూనివర్సిటీలో షార్ట్‌టర్మ్ కోర్సులు

విజయనగర్‌కాలనీ: మాసబ్‌ట్యాంక్ జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైనార్ట్స్ యూనివర్సిటీలోని ఫైనార్ట్స్ కళాశాల ఆధ్వర్యంలో లలిత కళల్లో స్వల్పకాలిక కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నట్లు ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ వెంకటేశ్వర్లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 8 నుంచి 15 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న పిల్లలకు డ్రాయింగ్, పెయింటింగ్, పోటరి, ఫొటోగ్రఫీ, యానిమేషన్, ట్యాలీగ్రఫీ కోర్సులలో శిక్షణ ఉంటుందన్నారు. మే 1 నుంచి తరగతులు ప్రారంభమవు తాయని, ఆసక్తి గల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు మాసబ్‌ట్యాంక్‌లోని ప్రభుత్వ ఫైనార్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్, 93470 48708, 80992 24945లలో సంప్రదించవచ్చన్నారు.

కుండలు చేద్దాం.. బొమ్మలు గీద్దాం

శిల్పారామంలో సమ్మర్ క్యాంపునకు ఏర్పాట్లు



మట్టి కుండ తయారు చేసిన చిన్నారి(ఫైల్)



శిల్పారామంలో గత సంవత్సరం నిర్వహించిన సమ్మర్ క్యాంపు



మే 1 నుండి 19వ తేదీ వరకు

మాదాపూర్: వేసవి సెలవుల సందర్భంగా శిల్పారామంలో సమ్మర్ క్యాంపు జరగనుంది. మే1వ తేదీ నుంచి 19వ తేదీ వరకు శిక్షణ తరగతులను నిర్వహించనున్నారు. 6 సంవత్సరాల నుంచి 60 సంవత్సరాల వయస్సు వారు వివిధ అంశాలలో శిక్షణ తీసుకోవచ్చు. శిక్షణ అనంతరం సర్టిఫికెట్లు కూడా అందజేస్తారు. రిజిస్ట్రేషన్ కోసం 8886652030, 8886652004 నంబర్లలో సంప్రదించాలి

- చిన్నచిన్న మట్టి కుండలు, గ్లాస్‌లు, మగ్‌లు తయారు చేసిన వారికే వాటిని ఇస్తాం. చిన్నారులు ఇలాంటి విద్యను నేర్చుకునేందుకు తల్లిదండ్రులు ప్రోత్సహించాలని మట్టిపాత్రల తయారీలో శిక్షణ ఇవ్వనున్న సుధాకర్ పేర్కొన్నారు.
- చిన్నారులు క్లేతో బొమ్మలు తయారు చేయడానికి ఎంతో ఇష్టపడతారు. బొమ్మలు, దేవతా విగ్రహాల ఆకృతులు తయారీకి ఆసక్తి చూపుతారు. చిన్నారులే కాకుండా పెద్దలు సైతం క్లే బొమ్మలకు ఇష్టపడతారు. అలాంటి వారికి ఈ శిక్షణ తరగతులు ఎంతగానో ఉపయోగపడుతాయి.
- పెయింటింగ్‌తో బాటు పెన్సిల్ స్కెచ్ మరో పద్ధతి. సులభంగా స్కెచ్‌లను ఏ విధంగా గీయాలో నేర్పించనున్నారు. గీసిన స్కెచ్‌లను ప్రదర్శనలో ప్రదర్శించవచ్చు.
- ఇక దేవ భాష సంస్కృతం, భగవద్గీత శ్లోకాలు నేర్పుతారు. తీసుకున్న శిక్షణను సంవత్సరం పొడవునా ప్రాక్టీస్ చేయాలన్నారు.
- మధుబని పెయింటింగ్ శిక్షణ రాజేశ్‌జా, చెరియాల్ పెయింటింగ్‌లో రాకేశ్, ట్రైబల్ పెయింటింగ్‌లో గణేశ్‌లు శిక్షణ ఇవ్వనున్నారు.

'ఇంటింటికీ సీపీఐ' విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య

రాజేంద్రనగర్: సీపీఐ ఆధ్వర్యంలో మోడీ హటావో దేశ్‌కో బచావో ఇంటింటి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య వెల్లడించారు. ఈ మేరకు పార్టీ రాజేంద్రనగర్ నియోజకవర్గ సమావేశాన్ని సోమవారం నిర్వహిచారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ నరేంద్రమోదీ అనుసరిస్తున్న విధానాలను వ్యతిరేకిస్తూ ఇంటింటి కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. నియోజకవర్గ పరిధిలో ఏప్రిల్ 20నుంచి మే 15వ తేదీ వరకు ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు పానుగంటి పర్వతాలు, సయ్యద్ అక్బర్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.కిషోర్, ఎం.ఏ.రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ కో–కన్వీనర్‌గా జైపాల్‌రెడ్డి

సీపీఐ రాజేంద్రనగర్ నియోజకవర్గ కోకన్వీనర్‌గా వనంపల్లి జైపాల్‌రెడ్డి నియమితులయ్యారు. రాజేంద్రనగర్‌లో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వనంపల్లి జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం తనవంతు బాధ్యతగా పని చేస్తానన్నారు.

యువకులు క్రీడల్లో రాణించాలి

మణికొండ: యువకులు చెడువ్యసనాలకు దూరంగా ఉండటంతో పాటు క్రీడలలో పాల్గొని రాణిస్తే ఎంతో మేలు జరుగుతుందని ఎమ్మెల్యే టి. ప్రకాశ్‌గౌడ్ అన్నారు. నార్సింగి మున్సిపాలిటీ వట్టినాగులపల్లిలో అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ సోమవారం ముగిసింది. ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే గెలుపొందిన జట్లకు కప్‌లను అందజేశారు. క్రీడల వల్ల దేహ దారుఢ్యంతో పాటు ఆరోగ్యం మెరుగవుతుందన్నారు. నార్సింగి మున్సిపల్ చైర్‌పర్సన్ డి.రేఖయాదగిరి, కౌన్సిలర్‌లు బి.యాదమ్మ, పి. ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.



విజేతలకు కప్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

ఉత్సాహంగా మీట్ అండ్ గ్రీట్



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

మణికొండ: గండిపేటలోని చైతన్య భారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(సీబీఐటీ) కళాశాలలో ఆదివారం రాత్రి పూర్వ విద్యార్థుల మీట్ అండర్ గ్రీట్–2023 కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు కేంద్ర మాజీ మంత్రి, రాజ్యసభ సభ్యుడు సుజనాచౌదరి, టాలీవుడ్ సినీ నటుడు రవివర్మ, నాస్కామ్ వైస్ ప్రెసిడెంట్, హెడ్ మెంబర్‌షిప్, ఔట్‌రీజ్ శ్రీకాంత్ శ్రీనివాసన్‌లు హాజరై తమ విద్యార్థి దశ జీవితాన్ని కళాశాలలో గడిపిన రోజులను నెమరువేసుకున్నారు. సీబీఐటీ అధ్యాపకులు తమ లాంటి వేలాది మంది విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దారన్నారు. కార్యక్రమంలో కళాశాల చైర్మెన్ డి. ప్రవీణ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రవీందర్‌రెడ్డి, కోఆర్డినేటర్ పి. సురేష్‌లతో పాటు 200మంది పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

కంటి వెలుగు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



కంటి వెలుగు కేంద్రాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్ గోకరి శ్రీలతసురేష్‌గౌడ్

బండ్లగూడ: అంధత్వం లేని తెలంగాణ రాష్ట్ర నిర్మాణానికి ముఖ్యమంత్రి కేసీఆర్ కంటి వెలుగు కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ కార్పొరేటర్ గోకరి శ్రీలతసురేష్‌గౌడ్ వెల్లడించారు. 18వ డివిజన్ శివాజీ యూత్ క్లబ్‌లో కంటి వెలుగు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై కంటి వెలుగు కేంద్రాన్ని ప్రారంభించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా కంటి వెలుగు కేంద్రాలను ఏర్పాటు చేస్తుందన్నారు. కార్యక్రమంలో కార్పొరేషన్ బీఆర్ఎస్ అధ్యక్షులు గోకరి సురేష్‌గౌడ్ పాల్గొన్నారు.

శ్మశానవాటికను అభివృద్ధి చేయాలని వినతి




శేరిలింగంపల్లి జాయింట్ కమిషనర్ మల్లారెడ్డికి వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి

రాయదుర్గం: ఖాజాగూడలోని కుమ్మరి సంఘం శ్మశానవాటికను అభివృద్ధి చేయాలని జీహెచ్‌ఎంసీ వెస్ట్‌జోన్ జాయింట్ కమిషనర్ మల్లారెడ్డికి గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, స్థానికులు వినతి పత్రం సమర్పించారు. జీహెచ్‌ఎంసీ శేరిలింగంపల్లి కార్యాలయంలో ఆయన జాయింట్ కమిషనర్‌ను కలిసి వివరించారు. శ్మశానవాటికకు ప్రహరి, నూతన బోర్, తదితర సౌకర్యాలు కల్పించాలని కోరారు. దీంతో ఆయన అధికారులతో ఫోన్‌లో మాట్లాడి వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఖాజాగూడ కుమ్మరి సంఘం సభ్యులు శ్రీనివాస్, భారతిభాయ్, భారతమ్మ, విఠల్, భిక్షపతి, ప్రవీణ్, లక్ష్మమ్మ, పెంటమ్మ పాల్గొన్నారు.

సర్కిల్ ఈఈ శ్రీనివాస్‌తో కార్పొరేటర్ సమావేశం

గచ్చిబౌలి డివిజన్‌లో నెలకొన్న సమస్యలను, చేపట్టవలసిన అభివృద్ధి పనులపై శేరిలింగంపల్లి సర్కిల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాస్‌ను గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి సోమవారం కలిశారు. ప్రస్తుతం కొనసాగుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యత ఇస్తూ త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలన్నారు. అలాగే పెండింగ్ పనులను వెంటనే ప్రారంభించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఈ విశాలాక్షి, ఏఈలు సునీల్, జగదీష్, నాయకులు అరుణ్‌గౌడ్, శేఖర్, ప్రభాకర్ పాల్గొన్నారు.

తెలంగాణ శాసనం ఉన్న ప్రాంత అభివృద్ధికి కృషి



మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌కు వినతిపత్రం అందజేస్తున్న విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ సంఘం ప్రతినిధులు

మంత్రి శ్రీనివాస్‌గౌడ్

గచ్చిబౌలి: తొలి తెలంగాణ శాసనం ఉన్న ప్రాంతాన్ని పర్యాటకరంగ ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని పర్యాటకశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. సోమవారం తెలంగాణ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ మాతృ సంఘం ప్రతినిధులు ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విశ్వకర్మ రాష్ట్ర సంఘం అధ్యక్షుడు డాక్టర్ వేములవాడ మదన్‌మోహన్ మాట్లాడుతూ.. సంగారెడ్డి జిల్లా రామచంద్రపురం మండలంలోని తెల్లాపూర్ గ్రామం తొలి తెలంగాణ శిలా శాసనం ఉన్న గ్రామమని గుర్తు చేశారు. ఆ గ్రామాన్ని అభివృద్ధి చేసి పర్యాటక ప్రాంతంగా మార్చాలని విజ్ఞప్తి చేశారు. దీంతో ఆ గ్రామంలో ఉన్న శాసనాలను గుర్తించి పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయడానికి తగు చర్యలు తీసుకోవాలని పురావస్తుశాఖ అధికారులకు మంత్రి ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ మాతృసంఘం గౌరవ అధ్యక్షుడు డాక్టర్ లాలుకోట వెంకటాచారి, ప్రధాన కార్యదర్శి బొల్లేటి కృష్ణమాచార్యులు, హనుమకొండ జిల్లా అధ్యక్షులు కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్..

రెండు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలు



బైక్‌ను ఢీ కొట్టిన కారు

మణికొండ: రెండు వేర్వేరు చోట్ల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు గాయపడ్డారు. పోలీసులు, బాధితులు తెలిపిన మేరకు.. సోమవారం నానక్‌రాంగూడ నుంచి నార్సింగి వైపు వస్తున్న ఓ ద్విచక్ర వాహనాన్ని వెనకనుంచి వచ్చిన రేంజ్ రోవర్ కారు(టీఎస్09ఈవై-2323) అశోకా లివియానా అపార్ట్‌మెంట్ సమీపంలో వేగంగా ఢీకొట్టింది. దాంతో బైక్‌పై ఉన్న ఇద్దరికి తీవ్ర గాయాలయినట్టు స్థానికులు తెలిపారు. వారిని వెంటనే 108 అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు. వారి నుంచి ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు పేర్కొన్నారు.

శంషాబాద్ రూరల్: గుర్తు తెలియని వాహనం ఢీకొనియ ఓ వ్యక్తి గాయపడ్డాడు. ఒడిశాకు చెందిన జగ్గలాల్‌దీప్(45) కుటుంబంతో కలిసి నాలుగు నెలల క్రితం పెద్దషాపూర్ గ్రామానికి వచ్చాడు. ఆదివారం అర్ధరాత్రి పొగాకు కోసం ఇంటి నుంచి వెళ్లాడు. పాల్మాకుల వద్ద బెంగళూరు జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు చికిత్స కోసం అతన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు.

యువకుడి అదృశ్యం



సంగమేష్(ఫైల్)

రాజేంద్రనగర్: ఇంటి నుంచి బయటకు వెళ్లినటో యువకుడు అదృశ్యమయ్యాడు.ఈ సంఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. రాఘవేంద్ర కాలనీకి చెందిన సంగప్పకు ముగ్గురు కుమారులు సంతానం. పెద్ద కుమారుడు సంగమేష్(19) డిగ్రీ చదువుతున్నాడు. ఆదివారం ఉదయం ఇంట్లో నుంచి ఎవరికి చెప్పకుండా బయటకు వెళ్లాడు. రాత్రైనా ఇంటికి రాకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు చుట్టు పక్కల ప్రాంతాలు, బంధువులు, స్నేహితుల వద్ద వాకబు చేశారు. అయినా ఎలాంటి ఆచూకీ లభించకపోవడం మైలార్‌దేవ్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. మిస్సింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

బీ ఫార్మసీ విద్యార్థిని ఆత్మహత్య

చాంద్రాయణగుట్ట: బీ ఫార్మసీ విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న ఘటన ఛత్రినాక పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. ఉప్పుగూడ సాయిబాబానగర్‌కు చెందిన విష్ణుకు ముగ్గురు పిల్లలు. పెద్ద కుమార్తె స్వప్న(20) గురుకుల్ హాస్టల్‌లో ఉంటూ బోడుప్పల్‌లోని జ్ఞానజ్యోతి కాలేజీ ఆఫ్ ఫార్మసీలో తృతీయ సంవత్సరం చదువుతుంది. ఈనెల 14న ఇంటికి వచ్చిన స్వప్న ఆదివారం రాత్రి వ్యాజ్‌మోల్ అనే హెయిర్ ఆయిల్‌ను తాగింది. 9 గంటల సమయంలో ఛాతిలో నొప్పి మొదలవ్వడంతో కాసేపు కుటుంబసభ్యులు సపర్యాయాలు చేసినప్పటికీ తగ్గలేదు. చివరకు వ్యాజ్‌మోల్ తాగిన విషయాన్ని స్వప్న తెలపడంతో చికిత్స నిమిత్తం ఒవైసీ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున 3.15గంటలకు మృతి చెందింది. ఆత్మహత్యకు గల కారణాలు మాత్రం తెలియరాలేదు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

విద్యార్థులకు బహుమతుల ప్రదానం



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న మంత్రి హరీష్‌రావు

బండ్లగూడ: విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని మంత్రి హరీష్‌రావు వెల్లడించారు. జాతీయ స్థాయి ఒలంపియాడ్ ఐఎన్‌టీఎస్‌వోలో ఉత్తమ ప్రతిభకనబరిచిన విద్యార్థులకు ఆయన సోమవారం బహుమతులు ప్రదానం చేశారు. సన్‌సిటీ శ్రీ చైతన్య విద్యార్థులు టి.సాయి వర్షిణి, టి.అక్షయ్‌వర్మలకు బహుమతులతో పాటు ట్యాబ్‌లను ఆయన అందించి అభినందించారు. కార్యక్రమంలో ఏజీఎం శివరామకృష్ణ, అనిత, ఎగ్జిక్యూటివ్ డీన్ సుగుణాకర్ విద్యార్థులు పాల్గొన్నారు.

ఎంజీఐటీలో జాతీయ సెమినార్ ప్రారంభం



సెమినార్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న అతిథులు

మణికొండ: గండిపేటలోని చైతన్య భారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంజీఐటీ) కళాశాలలో సోమవారం రెండు రోజుల జాతీయ సెమినార్ ప్రారంభమైంది. ఇందులో మెటీరీయల్స్, ఎండ్ ప్రాసెసెస్(ఎఎంపీ–2023) మొదటి రోజు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా డాక్టర్ బాలమురళీ కృష్ణన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాము ఎంచుకున్న రంగంలో ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా ఉక్కు సంకల్పంతో రాణించాలన్నారు. కళాశాల చైర్మెన్ డి. ప్రవీణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అదనపు విల్లాల సీజ్



చిత్రపురిలో విల్లాలను సీజ్ చేస్తున్న మణికొండ టౌన్‌ప్లానింగ్ అధికారి రాకేష్

మణికొండ: తీసుకున్న అనుమతులకంటే అధికంగా నిర్మిస్తున్న విల్లాలపై మణికొండ మున్సిపల్ అధికారులు మరోమారు కొరడా ఝులిపించారు. మున్సిపాలిటీ పరిధిలోని చిత్రపురి కాలనీలో సింగిల్, డబుల్, త్రిబుల్ బెడ్‌రూమ్‌ల ఫ్లాట్లతో పాటు కొన్ని విల్లాల నిర్మాణానికి అనుమతి ఉంది. అయితే, తీసుకున్న అనుమతులకన్నా అదనంగా విల్లాలను నిర్మించటంతో గతంలోనే నాలుగు విల్లాలను సీజ్ చేశారు. అయినా పట్టించుకోకుండా ఇటీవల తిరిగి వాటి నిర్మా పనులను ప్రారంభించారు. దాంతో స్థానికులు మరోసారి మున్సిపల్ కమిషనర్ ఫల్గుణ్‌కుమార్‌కు ఫిర్యాదులు చేశారు. స్పందించిన ఆయన వాటిని మరోమారు సీజ్ చేయాలని ఆదేశించడంతో సోమవారం టీపీఓ రాకేష్ ఆధ్వర్యంలో సిబ్బంది వాటికి టేపులు వేసి, బోర్డులను ఏర్పాటు చేసి సీజ్ చేశారు. మున్సిపాలిటీ అధికారులు సీజ్ చేసినా తిరిగి వాటిని స్వాధీనం చేసుకొని పనులు చేపట్టడం చట్టరీత్యా నేరం అయినా అలాంటి వారిపై క్రిమినల్ కేసులు ఎందుకు నమోదు చేయటం లేదని చిత్రపురి కాలనీవాసులు ప్రశ్నిస్తున్నారు. మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్, ఉన్నతాధికారులు ఆ దిశగా ఆదేశాలు జారీ చేయాలని వారు కోరుతున్నారు.

కాలనీలో సమస్యలు పరిష్కరించుకోండి

ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ



వేమనరెడ్డి కాలనీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గాంధీ తదితరులు

మియాపూర్: ప్రతి కాలనీలో జరిగే కాలనీల కాంటాక్ట్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని మీ కాలనీ సమస్యలు పరిష్కరించుకోవాలని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పేర్కొన్నారు. చందానగర్ డివిజన్ పరిధిలోని వేమన కాలనీ, వేమన వీకర్ సెక్షన్ కాలనీల్లో సోమవారం కాలనీ కాంటాక్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ మంజులరఘునాథ్‌రెడ్డి, సర్కిల్–21 ఉప కమిషనర్ సుదాంశ్ హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని ప్రతి కాలనీ, బస్తీ, రెసిడెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌లో ఉన్న సమస్యల పరిష్కారమే ధ్యేయంగా జీహెచ్‌ఎంసీ అధికారులు, వివిధ శాఖల ప్రభుత్వ అధికారులతో కలిసి ప్రతి కాలనీకి వెళ్లి సమస్యలు తెలుసుకొని పరిష్కరించడం జరుగుతోందన్నారు. సుమారు 15 శాఖలకు సంబంధించిన అధికారులు హాజరవుతారని తెలిపారు. రోడ్లు, డ్రైనేజీ, మంచినీటి సమస్య, నాలా సమస్యలు, ఫుట్‌పాత్, పార్కు, వీధి దీపాలు, కుక్కల బెడద నుంచి రక్షణ చర్యలు, మహిళ సంరక్షణ చర్యలు, ఆరోగ్య సమస్యలు, ట్రాఫిక్, పోలీస్ 100 డయల్, సైబర్ క్రైమ్, ఈవ్ టీజింగ్, విద్యుత్ లైన్లు తదితర సమస్యలు ఉంటే అధికారులకు తెలియజేయాలన్నారు. జీహెచ్‌ఎంసీ అధికారులు ఏఎంఓహెచ్ కార్తీక్, టౌన్ ప్లానింగ్ ఏసీపీ సంపత్, చందానగర్ ఎస్ఐ శ్రీధర్, డాక్టర్ కీర్తి, ఎస్ఆర్‌పీలు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, నాయకులు, కాలనీ అసోసియేషన్, కాలనీవాసులు పాల్గొన్నారు.

కంటి వెలుగు పరిశీలన

చందానగర్ డివిజన్ పరిధిలోని వేమనరెడ్డి కాలనీలోని కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, కార్పొరేటర్ మంజులరఘునాథ్‌రెడ్డితో కలిసి సోమవారం పరిశీలించారు. అధికారులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం చందానగర్ డివిజన్ పరిధిలోని వేముకుంట కాలనీలో రంజాన్ తోఫాలను అందజేశారు.

తారానగర్‌లో..

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి డివిజన్ తారానగర్‌లో కమ్యూనిటీ ఎంగేజ్‌మెంట్ అండ్ సిటిజన్ గ్రీవియన్స్ డిస్పోజల్ ప్రోగ్రామ్ వంద రోజుల కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ, వాటర్ వర్క్స్, హెల్త్ డిపార్ట్‌మెంట్ల అధికారులు పాల్గొన్నారు.